క్లుప్తంగా...

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 60, పొడుగు వంకాయ 35, బెండకాయ 23, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 40, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 20, పందిరి బీర 18, క్యాబేజీ 13, క్యారెట్ 28, దొండ 23, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 23, కీర 18, దోసకాయ 13, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 28, ఆలుగడ్డ 21, చామగడ్డ 35, మొరంగడ్డ 45, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.


కొనసాగుతున్న కాంట్రాక్టు అధ్యాపకుల ధర్నా

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల పర్మనెంట్ కోసం కాంట్రాక్టు అధ్యాపకుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. సోమవారం ఆర్ట్స్ కాలేజీ బస్టాప్ వద్ద వివిధ కాలేజీలకు చెందిన అధ్యాపకులు ధర్నా చేపట్టారు. యూనివర్సిటీల అధ్యాపకులను పర్మనెంట్ చేసేందుకు ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తుందో తెలపాలని జేఏసీ నాయకులు డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ విజేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

మందుబాబులకు జైలుశిక్ష

రసూల్‌పురా: మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురికి జైలుశిక్ష విధించిన ఘటన తిరుమలగిరి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మధుబాబు వివరాల ప్రకారం.. సోమవారం చేపట్టిన వాహనాల తనిఖీల్లో 17 మంది పట్టుబడ్డారు. వారందరిని నాంపల్లి కోర్టులో హాజరు పర్చగా 12 మందికి జరిమానా, ఐదుగురికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు సీఐ పేర్కొన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తరాదు



స్వామివారిని దర్శించుకున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్: చరిత్రాత్మకమైన సికింద్రాబాద్ గణపతి దేవాలయంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా సాగేలా చూడాలని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు. సోమవారం ఆయన గణపతి దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు మంత్రికి ఆలయ అధికారులు, ధర్మకర్తలు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఎంతో చరిత్ర ఉన్న గణపతి దేవాలయానికి వేలాది మంది భక్తులు వస్తారని వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ వినోద్, చైర్మన్ ఓదెల సత్యనారాయణ, సభ్యులు బాబూరావు, మాజీ చైర్మన్ జయరాజ్ పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం'



పవర్‌బోర్ పనులను ప్రారంభిస్తున్న దీపక్‌జాన్

అడ్డగుట్ట: స్థానిక సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని కాంగ్రెస్ సీనియర్ నాయకులు దీపక్ జాన్ ఆరోపించారు. అడ్డగుట్టలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఆయన పాదయాత్ర చేశారు. బస్తీలో పవర్‌బోర్ ఏర్పాటు చేయాలని పలుమార్లు బీఆర్ఎస్, బీజేపీ నాయకులతో మొర పెట్టుకున్నా పట్టించుకోలేదని ఈ సందర్భంగా స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన ఏ, బీ సెక్షన్ వాసుల సౌకర్యార్థం తన సొంత నిధులతో పవర్ బోర్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో బొట్టు నర్సింగ్‌రావు, నరేందర్, రామలీల, మహాలక్ష్మి, అల్లం సునీల్, బసవ రాజ్, విశాల్, నవీన్, లక్ష్మీనారాయణ, హనుమంతు పాల్గొన్నారు.

ఎంటమాలజీ సూపర్‌వైజర్లపై విచారణ జరిపించాలి

ముషీరాబాద్: నియోజకవర్గంలో పనిచేస్తున్న ఎంటమాలజీ డిపార్ట్‌మెంట్ ఔట్‌సోర్సింగ్ సూపర్‌వైజర్లపై విజిలెన్స్ డిపార్ట్‌మెంట్‌తో విచారణ జరిపించాలని బీజేవైఎం ముషీరాబాద్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ గడ్డం నవీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమీషనర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. రాంనగర్ డివిజన్‌లోని హరినగర్, రిసాల, అంబేద్కర్‌నగర్, తదితర ప్రాంతాల్లో దోమలు ఎక్కువగా ఉన్న అనేక ప్రాంతాల్లో ఫాగింగ్ చేయాలని గత 6 నెలలుగా విజ్ఞప్తి చేస్తున్నా.. పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి తోడు ఫాగింగ్ చేసే సమయంలో ఉపయోగించే డిజిల్, పెట్రోల్, మెథిలిన్‌లను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారని సీనియర్ ఎంటమాలజీస్టుకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రైవేటు ఫంక్షన్‌హాల్స్, గోడౌన్స్, సూపర్‌మార్కెట్స్, హోటళ్లలో ఫాగింగ్ చేస్తూ.. వ్యక్తిగత లాభాలు పొందుతున్నారని ఆరోపించారు. ఫిర్యాదు కాపీని మంత్రి కేటీఆర్, ప్రిన్సిపల్ సెక్రటరీ, జోనల్ కమిషనర్ చీఫ్ ఎంటమాలజీస్టుకు పంపుతున్నామని వివరించారు.



బండిమెటల్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడిని దర్శించుకున్న మంత్రి తలసాని



వినాయకుడిని దర్శించుకున్న ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ సుమతి, చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి



బన్సీలాల్‌పేట్‌లో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న కోట నీలిమా

విఘ్నేశ్వరుడికి పూజలు.. భక్తులకు అన్నదానాలు

సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ పరిధుల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. వివిధ మండపాల్లో కొలువుదీరిన బొజ్జ గణపయ్యలను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మండపాల నిర్వాహకులు, దాతలు పలు మండపాల వద్ద అన్నదానాలు చేస్తుండటంతో ఎటు చేసినా ఆధ్మాత్మిక శోభ సంతరించుకుంటోంది.

–సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ల బృందం



కూచిపూడి కళాకారులను సన్మానిస్తున్న మాజీ మేయర్ కార్తీకరెడ్డి



గణనాథుడికి పూజలు చేస్తున్న ఓయూ సీఐ అంజనేయులు



రెజిమెంటల్‌బజార్‌లో అన్నదానంలో పాల్గొన్న లాస్య నందిత



చింతల్ బస్తీలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దిలీప్‌రెడ్డి



తార్నాక లేబర్ అడ్డా వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శివారెడ్డి, వీరన్న



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నేతలు



శివపుత్ర ఫ్రెండ్స్ అసోసియేషన్ మండపంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



నిమజ్జనానికి తరలుతున్న టీఎస్‌పీసీబీ పర్యావరణహిత గణనాథుడు



బేగంపేటలో.. గణనాథుడి పూజలో పాల్గొన్న గౌరపల్లి రమేష్

స్పష్టమైన హామీ ఇస్తేనే సమ్మె విరమిస్తాం

'గాంధీ' కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది



విధులు బహిష్కరించి ధర్నా చేస్తున్న కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది

గాంధీఆస్పత్రి: న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని గాంధీ అవుట్ సోర్సింగ్ నర్సింగ్ సిబ్బంది చేపట్టిన విధులు బహిష్కరణ, నిరసనలు రెండవ రోజైన సోమవారం కొనసాగాయి. ఆస్పత్రి ప్రాంగణంలో బైఠాయించి ధర్నా చేపట్టిన సిబ్బందితో ఆస్పత్రి సూపరింటెండెంట్ పలుమార్లు చర్చలు జరిపారు. మొత్తం 16 డిమాండ్లతో వినతిపత్రం ఆయనకు అందించగా, తన పరిధిలో ఉన్న వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని, మిగిలినవి పది రోజుల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చిన ఆయన సమ్మె విరమించి విధుల్లో చేరాలని కోరారు. స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు సమ్మె కొనసాగుతుందని ఈనెల 26 (నేడు) వైద్యమంత్రి హరీష్‌రావును కలిసి తమ న్యాయమైన సమస్యలు, డిమాండ్లను వివరిస్తామని కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఎఫ్‌సీఐ కార్యకలాపాల బలోపేతానికి కార్యాచరణ

రాంగోపాల్‌పేట్: ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కార్యకలాపాలను మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తామని ఎఫ్‌సీఐ తెలంగాణా కమిటీ తెలిపింది. సంగీత్ చౌరస్తాలోని కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సభ్యులు సత్యమూర్తి, సీతారామరావు, గౌతం, రిజ్వాన్, తిరుపతి మాట్లాడారు. తాము ఇటీవల ఢిల్లీలో కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాలు శాఖ సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతిని కలువగా ఎఫ్‌సీఐ కార్యకలాపాలపై సమగ్ర నివేదిక అందించాలని ఆమె కోరారన్నారు. తాము తెలంగాణాను సందర్శించాలని మంత్రిని కోరగా ఆమె సానుకూలంగా స్పందించారని, సంస్థలో అనైతిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారన్నారు.

యువతి విషయంలో గొడవ: స్వల్ప ఉద్రిక్తత

రాంగోపాల్‌పేట్: ఓ యువతి విషయంలో విద్యార్థుల మధ్య తలెత్తిన గొడవతో కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సోమవారం మధ్యాహ్నం ఇద్దరు యువకులు ఓ యువతితో మాట్లాడుతున్నారు. దీన్ని గమనించిన కొంత మంది వారి వద్దకు వచ్చి గొడవకు దిగారు. యువతితో మాట్లాడుతున్న ఇద్దరు యువకులు తమ సోదరులకు చెప్పడంతో వాళ్లు అక్కడికి రావడంతో రెండు వర్గాల వాగ్వాదం తలెత్తింది. ఒకరిపై ఒకరు రాళ్లు రువ్వుకునే స్థాయికి వెళ్లడంతో స్థానికులు వచ్చి అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న గోపాలపురం ఇన్‌స్పెక్టర్ మురళీధర్ సిబ్బందితో అక్కడికి వచ్చి వారిని చెదరగొట్టారు. అనంతరం ఇరు వర్గాలను పిలిపించి పెట్టీ కేసు నమోదు చేసి హెచ్చరించి పంపించారు.

లాస్యనందితకు మద్దతుగా ప్రచారం

రసూల్‌పురా: కల్లబొల్లి కాంగ్రెస్, అబద్ధాల బీజేపీ మాటలు నమ్మి విలువైన ఓటును ఆ పార్టీలకు వేసి తమ ఓటు హక్కును దుర్వినియోగం చేసుకోవద్దని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్. శ్రీనివాస్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గ అభ్యర్థి లాస్యనందితకు మద్దతుగా సోమవారం ఆయన రసూల్‌పురాలోని అన్నానగర్, ఇంద్రమ్మ నగర్ పెద్ద రోడ్, మైసమ్మ టెంపుల్ లైన్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నేతలు ఒరగబెట్టిందేమీ లేదని కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పటికీ అభివృద్ధికి సర్వీసు పన్నుల రూపంలో రావాల్సిన నిధులు కేటాయించలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కొనసాగిన కాలంలో కంటోన్మెంట్‌లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ దేవులపల్లి శ్రీనివాస్, నరసింహ, చామంతుల క్రిష్ణయ్య పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న శ్రీనివాస్

'పేటెంట్ల' ఐలయ్య



ఉస్మానియా యూనివర్సిటీ: పీజీ నుంచే పరిశోధనలు అలవర్చుకున్నట్లు డాక్టర్ సాదం ఐలయ్యయాదవ్ తెలిపారు. తన పరిశోధనలతో వరుసగా రెండు పేటెంట్లను సాధించిన ఆయన సాక్షితో మాట్లాడారు. ఓయూ క్యాంపస్ టెక్నాలజీ కాలేజీలో పదేళ్ల నుంచి కాంట్రాక్టు అధ్యాపకులుగా పని చేస్తున్న ఆయన పరిశోధనలకు 34 ఏళ్లకే రెండు పేటెంట్ లభించినట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వర్సిటీ ఉన్నత విద్యను అందుకునే విద్యార్థులకు ప్రతి అంశం పైన అవగాహన ఉంటుందన్నారు. వాటికి పదునుపెట్టి పరిశోధనలు చేస్తే ప్రతి స్కాలర్ పేటెంట్లు పొందవచ్చని సూచించారు. నల్గొండ జిల్లా, చిట్యాల మండలం, వనిపాకల గ్రామానికి చెందిన ఐలయ్య కుటుంబం బతుకుదెరువు కోసం నగరంలోని కర్మన్‌ఘాట్‌కు వచ్చారు. తండ్రి పిచ్చయ్య ఆటోడ్రైవర్, తల్లి యాదమ్మ ఇళ్లలో పని చేస్తూ ఐలయ్యను చదివించారు. పది వరకు తెలుగు మీడియంలో చదివిన ఐలయ్య ఇంటర్ నుంచి ఇంగ్లిష్ మీడియంలో చదువుకున్నారు. తొలుత ఇంగ్లిష్ భాష కష్టం అవడంతో ఆంగ్లంలో శిక్షణ పొంది రాయడం ధారాళంగా మాట్లాడటం నేర్చుకున్నారు. చదివింది కెమికల్ ఇంజినీరైనా తెలుగు సాహిత్య రంగంలో కవి, రచయిత, యోగా శిక్షణ, మోటివేషన్ తరగతులు, తదితర అంశాలలో ప్రతిభ కనపరుస్తూ అనేక అవార్డులు పొందారు.


వీధి కుక్కలతో బస్తీవాసులకు ఇబ్బంది కలిగిస్తున్న వ్యక్తిపై కేసు

రాంగోపాల్‌పేట్: వీధి కుక్కలను పెంచుతూ బస్తీవాసులకు భయాందోళనకు గురిచేస్తూ ప్రశ్నించిన వారిని దుర్భాషలాడుతున్న ఓ వ్యక్తిపై రాంగోపాల్‌పేట్ పోలీసులు కేసు నమోదు చేశారు. చుట్టాలబస్తీలోని ఓ భవనంలోని మూడో అంతస్తులో నివాసముంటున్న అమిత్ ఐదు వీధి కుక్కలను పెంచుతూ వాటిని మెట్లమార్గంలో ఉంచుతూ అక్కడే వాటికి ఆహారం అందిస్తుండటంతో అపరిశుభ్రత నెలకొంది. అప్పుడప్పుడు కుక్కలను బయటకు వదులుతుండటంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. సోమవారం మరోసారి కుక్కలను బయటకు వదలగా అవి గట్టిగా అరుస్తుండటంతో స్థానికంగా ఉండే ఓ మహిళతో పాటు మరికొందరు కలిసి అమిత్‌ను నిలదీశారు. ఈ క్రమంలో అమిత్ వారిని ఇష్టానుసారంగా మాట్లాడటంతో సదరు మహిళ ఫిర్యాదు మేరకు రాంగోపాల్‌పేట్ పోలీసులకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మోండామార్కెట్, రాంగోపాల్‌పేట్ డివిజన్లలో సోమవారం ఆయన కార్పొరేటర్లు కొంతం దీపిక, చీర సుచిత్రతో కలిసి రూ.1.77 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ రకాల అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నిధులకు కొరత లేకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కొన్ని దశాబ్దాల నుంచి పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలకు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పరిష్కారం చూపించామన్నారు. నల్లగుట్టలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరగా త్వరలోనే ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. రాంగోపాల్‌పేట్‌లో శిథిలావస్థకు చేరుకున్న గ్రంథాలయ భవనాన్ని పరిశీలించి కొత్త భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. చుట్టలబస్తీలో ఓ వ్యక్తి కుక్కలను పెంచుతూ ఇబ్బందులు కలిగించడంతో పాటు తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకురాగా ఈ విషయంపై దృష్టి సారించాలని రాంగోపాల్‌పేట్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు జీహెచ్ఎంసీ అధికారులను సూచించగా కాసేపటి తర్వాత జీహెచ్ఎంసీ అధికారులు వచ్చి కుక్కలను తీసుకెళ్లారు. జోనల్ కమిషనర్ రవికిరణ్, డీసీ శంకర్, ఈఈ సుదర్శన్, ఏడీఈ దుర్గాప్రసాద్, మాజీ కార్పొరేటర్లు మల్లికార్జున్‌గౌడ్, అత్తెల్లి అరుణగౌడ్, కోళికే కిరణ్మయి, ఆకుల రూప, నాయకులు స్కైలాబ్ యాదవ్, నాగేందర్, ఆకుల హరికృష్ణ, మహేష్ యాదవ్ పాల్గొన్నారు.



పనుల ప్రారంభోత్సవంలో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

కుల వృత్తులకు పూర్వ వైభవం..

సనత్‌నగర్: కుల వృత్తులకు పూర్వ వైభవం తీసుకురావాలన్న సంకల్పంతో సీఎం కేసీఆర్ ఆర్థిక చేయూతనందిస్తున్నారని మంత్రి తలసాని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలువురు బీసీ కుల వృత్తిదారులకు రూ. లక్ష ఆర్థిక సహాయ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ అధికారి ఆశన్న, కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరిశ్రీహరి, హేమలత, మాజీ కార్పొరేటర్లు ఎన్.శేషుకుమారి, అరుణగౌడ్, ఆకుల రూప పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి

పీహెచ్‌సీల్లో వసతుల కల్పనకు చర్యలు

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పట్టణ ప్రాథమిక కేంద్రాల్లో ప్రజలకు కనీస వసతులను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత తెలిపారు. సోమవారం తిరుమలగిరి లాల్‌బజార్ ఆరోగ్య కేంద్రంలో బోర్డు మాజీ సభ్యుడు పి. శ్యామ్‌కుమార్ సొంత నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్ మిషన్‌ను నివేదిత ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఇటీవల లాల్‌బజార్‌లోని ఆరోగ్య మహిళా కేంద్రం ప్రారంభించే సమయంలో తాగునీటి వసతి కల్పిస్తామని శ్యామ్‌కుమార్ ఇచ్చిన హామీ మేరకు తాగునీటి వసతి కల్పించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఉపాధ్యక్షులు యశ్వంత్‌కుమార్, బీసీసెల్ ఉపాధ్యక్షుడు ఉమేష్, కార్మిక విభాగం ఉపాధ్యక్షుడు దుర్గా ప్రసాద్, మహిళా ఉపాధ్యక్షురాలు అనురాధరెడ్డి, నిత్యానంద్, సదానంద్ గౌడ్, పర్వేజ్ ఖాన్, రమేష్, సూరి, సంధ్య పాల్గొన్నారు.



వాటర్‌ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న నివేదిత, శ్యామ్‌కుమార్

రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి


అమీర్‌పేట: రక్తదానం చేసేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని గురుగోవింద్‌సింగ్ మున్సిపల్ స్టేడియంలో సోమవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని అక్టోబర్ 2వ తేదీ వరకు వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

- పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా అమీర్‌పేట పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దీన్ దయాళ్ చిత్రపటానికి కిషన్‌రెడ్డి, కార్పొరేటర్ సరళ, పార్టీ నేతలు బూర్గుల శ్యామ్‌సుందర్‌గౌడ్, శ్రీశైలం గౌడ్‌తో కలిసి నివాళులర్పించారు.



రక్త దానం శిబిరాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కార్పొరేట్ స్థాయిలో వైద్యసదుపాయాలు



మాట్లాడుతున్న టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్

నల్లకుంట: ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటుందని టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. మూడంచెలుగా ఉన్న ఆరోగ్య శాఖను ఐదెంచెలుగా మార్చిన ఘనత మంత్రి హరీష్‌రావుదేనన్నారు. పల్లె దవాఖానాలు, యూపీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలు అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు.

- తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్ (టీజీపీఏ) ఆధ్వర్యంలో సోమవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఆడిటోరియంలో ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న ఫార్మసిస్టుల సమస్యలను ప్రభుత్వం, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానన్నారు. తానని తెలిపారు. కోవిడ్ సమయంలో ఫార్మసిస్టులు అందించిన సేవలు మరువలేని, మిమ్మల్ని ప్రభుత్వం కాపాడుకుంటుందని అన్నారు. ఫార్మసిస్టులకు ప్రజలకు సేవ చేసుకునే అవకాశం మనకు వచ్చిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల సంఖ్య పెరిగిన సందర్భంలో ఫార్మసిస్టు ఉద్యోగాల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం ఉండేది కాదని, నేడు వైద్యులు, ఫార్మసిస్టులు, ఇతర వైద్య సిబ్బంది అహర్నిశలు చేస్తున్న కృషి వల్ల ప్రభుత్వ దవాఖానాలపై ప్రజలకు సంపూర్ణ నమ్మకం ఏర్పడిందన్నారు.
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందే రోగికి రూ.42 ఉన్న డైట్‌చార్జీని రూ. 100కు పెంచామన్నారు. రోగితో పాటు రోగి అటెండర్‌కు కూడా ఆహారం అందిస్తున్నామని తెలిపారు.
- రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ ఆసుపత్రిలోనైనా మందుల కొరత లేకుండా సీఎం కేసీఆర్ ఆదేశాలు, ఆరోగ్యశాఖ మంత్రి సూచనల మేరకు వివిధ వ్యాధులకు సంబంధించిన సుమారు 824 ఔషదాలను అందుబాటులో ఉంచామన్నారు.
- ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో అన్ని ఆసుపత్రుల్లోనూ ఈ ఔషదిని(డాటా ఎంట్రీ) అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఏదైనా డ్రగ్స్ స్టోర్స్, ఆసుపత్రుల్లో సాంకేతిక కారణాల వల్ల ఈ ఔషధి ఆన్‌లైన్ చేయకుంటే వెంటనే ఆన్‌లైన్ చేయాలన్నారు.
- ఫార్మసీస్టోర్స్‌లో అవసరం మేరకే గడువు ఉన్న మందులనే అందుబాటులో ఉంచి పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించడంలో ఫార్మసిస్టులు కృషి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రోగులకు అందించే మందుల గడువు ముగిసి ప్రభుత్వం, ప్రజలపై ఆర్థికభారం పడకుండా అవసరం మేరకు మాత్రమే మందుల కోసం ఇండెంట్ పెట్టుకోవాలన్నారు.
- మందులు ఎక్స్‌పైరీ డేట్ ముగిసి మందులు వృధా కాకుండా తేదీ ముగిసేలేపే ప్రజలకు ఉపయోగపడేలా చూసుకునే బాధ్యత ఫార్మసిస్టులపై ఉందన్నారు. టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల సుదర్శన్ గౌడ్, ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శంకర్, డిప్యూటీ డ్రగ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా డాక్టర్ రామకిషన్, ప్రభుత్వ వైద్యుల జాక్ అధ్యక్షుడు కత్తి జనార్ధన్, కార్యదర్శి డాక్టర్ పూర్ణచందర్, టీజీపీఏ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జాలిగామ అశోక్, ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, టీఎంహెచ్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్ బ్రూస్, నాయకులు లావణ్య, పద్మజ తదితరులున్నారు.

కార్యక్రమానికి హాజరైన ఫార్మసిస్టులు

